•

నాలుగు స్తంభాలాట

"బుగతమ్మగోరా! బుగతమ్మగోరూ! యీ అబ్బాయి గోరు తవ యింటికోసం నెలకత ఉంటే తోలు కొచ్చినాను. లోనకెల్లండి బావు!" అన్నాడు అసిరయ్య వీధి గుమ్మంలో నిల్చుని.

రామశర్మ నాలుగు అడుగులు వేసి గడపలోకి వెళ్ళి గుమ్మంలో నిల్చున్న కామేశ్వరమ్మను చూసి చేతిలో సంచి క్రిందపెట్టి రెండు చేతులో జోడించి నమస్కరించేడు. రామశర్మకు సుమారు తొమ్మిది సంవత్సరాల వయస్సుంటుంది. పసిమి చాయ. లాగు చొక్కవేసుకున్నాడు. నుదుట వీబూధిరేఖ. ముఖంలో చక్కటి కళ, తేజస్సుంది. ఎవరు బాబూ నువ్వు? ఎవరు కావాలి?" అంది.

"నా పేరు రామశర్మండీ! గురువుగారి వద్ద వేదం నేర్చుకుందుకు వచ్చాను"

కామేశ్వరమ్మ ఆ అబ్బాయి ముఖంలోకి చూస్తూ క్షణకాలం అలా నిల్చుండిపోయింది. వాడి వినయ విధేయతలకు విస్తుపోయింది.

"ఏ ఊరు మీది?

"విశాఖపట్నం అండీ"

అంత దూరం నుండి ఒంటరిగా వచ్చావా? తోడుగా ఎవరూ రాలేదా? ఆయన ఇప్పుడు ఎవరికీ వేదం...."

"ఎవరా వచ్చింది? ఎవరీ అబ్బాయి?" అంటూ సోమయాజిగారు వచ్చేరు.

"ఆయనే వచ్చారు! వారితోనే మాట్లాడు" అంటూ ప్రక్కకి తప్పుకుంది కామేశ్వరమ్మ



రామశర్మవారికి సాష్టాంగ నమస్కారంచేసి వారివద్ద వేదం నేర్చుకుందుకు వచ్చిన విషయం చెప్పేడు.

సాకేత రామసోమయాజిగారు గొప్ప వేదపండితులు. నాలుగు వేదాల్లోను ఆయనను మించిన వారు దేశంలోనే లేరు. రాష్ట్రపతి వద్ద బంగారు పతకాలు, ప్రసంశాపత్రాలు అందుకున్నారు. సంస్కృతం, శాస్త్రాలు అభ్యసించేరు. ఎన్నో సన్మానాలు పొందేరు. దేశం నలుమూలలా వారి శిష్యులున్నారు. వారికి గ్రామంలో మంచి నీటి వసతి గల ఏభై ఎకరాల పొలం ఉంది. దానిమీద వచ్చే ఫలసాయంతో వారు తన ఇంటి వద్ద విద్యార్థులకు చిన్న గురుకులం నడుపుతూ అన్ని సదుపాయాలతో ఉచిత వేద విద్య నేర్పుతున్నారు. వారి భార్య కామేశ్వరమ్మ భర్తకు అన్ని విధాలా అనుకూలవతి.

సోమయాజిగారు గత పది సంవత్సరాలుగా ఎవరికీ వేదం నేర్పటంలేదు.. వారి వద్ద శిష్యులెవరూ లేరు. ఆయన రామశర్మ ముఖంలోకి క్షణ కాలంచూసి చిరునవ్వు నవ్వి

"సరే! కామేశ్వరీ అబ్బాయిని లోనికి తీసుకొని వెళ్లు! ఏవైనా తినడానికి పెట్టు" అన్నారు.

కామేశ్వరమ్మ భర్త మాటలు నమ్మలేనట్లు అచేతనంగా నిల్చుని అబ్బాయి వంకే చూస్తోంది.

"నీకే చెప్పింది!" అనే సరికి ఆవిడ త్రుళ్లిపడి "రాబాబూ!" అంటూ లోనికి తీసుకొని వెళ్ళింది.

"బాబూ! రాత్రి నీళ్లల్లో వేసిన చల్ది అన్నం ఉంది పెరుగు వేసుకొని తింటావా? లేక అటుకులు ఉన్నాయి పాలల్లో వేసి యివ్వనా?" అంది ఆప్యాయంగా

"చల్ది అన్నం తింటానండి" అన్నాడు.

"సరే బట్టలు మార్చుకొనిరా" అంది.

రామశర్మ సంచిలోంచి తడి గా వంచా, తువ్వాలు తీసుకొని తడిగావంచా కట్టుకున్నాడు. పెరట్లోకి వెళ్లి నూతివద్ద కాళ్లూ చేతులూ కడుక్కొని వచ్చాడు. కామేశ్వరమ్మ పీటవేసి ఆకులో చల్ది అన్నం పెట్టి పెరుగు అవకాయ వేసింది. గ్లాసుతో మంచినీళ్లు పెట్టింది. రామ శర్మ తడిగావంచాతో కూర్చుని చల్ది అన్నం తిని ఆకుపారవేసి అక్కడ సుద్దిచేసేడు.

సోమయాజిగారికి మళ్లీ ఇన్నేళ్ల తరువాత గతం గుర్తుకొచ్చింది-

"అన్నా చెల్లెలూ సంప్రదించుకొని నిర్ణయం తీసుకున్న తరువాత ఇక నా ఆమోదం ఎందుకు బావగారూ?" అన్నారు రామసోమయాజిగారు.

"అదేవిటి బావగారూ! అలా అంటున్నారు? ఇదీ మీ అబ్బాయి చదువు విషయం! వాడి భవిష్యత్తు నిర్ణయించాల్సింది...."

"తండ్రిగా నా బాధ్యత! అయితే ఈ ఇంగ్లీషు చదువుల గురించి నాకేం తెలుసు చెప్పండి! అయినా మీరేం పరాయి వాళ్లుకాదు! కాలాను గుణంగా వాడిని తీర్చి దిద్దాలనీ, వాడి మంచి భవిష్యత్తుకోసం ఓ నిర్ణయం తీసుకున్నాక నేను అడ్డు చెప్పడం భావ్యం కాదు. నేను నేర్చుకున్న వేద శాస్త్రాలు ఈ రోజుల్లో ఎవరికి కావాలి చెప్పండి?" అన్నారు.

"అది కాదండీ! అబ్బాయి శివశర్మ ఇంగ్లీషు స్కూల్లో చదువుతానని సరదా పడుతున్నాడు. వేదశాస్త్రాలు చేతిలో విద్య! ఇంటి పట్టున వున్నప్పుడవి మీ వద్ద సావకాశంగా నేర్చుకుంటాడు" అంది కామేశ్వరమ్మ.

సోమయాజులు గారు భార్యవేపు చూసి పేలవంగా నవ్వేరు.

"ప్రయాణం ఎప్పుడు నిర్ణయించుకున్నారు?" అన్నారు బావమరిది రామజోగితో.

"మధ్యాహ్నం బస్సుకి బయల్దేరుదామనుకుంటున్నాం! ఈ రోజు దశమి మంచిది. రేపు ఏకాదశి! స్కూల్లో చేర్పించడానికి అన్ని విధాల అబ్బాయి పేర బావుంది!"

"సరే మంచిది! చూడు కామేశ్వరీ! సందుగ పెట్టి తాళాలివిగో! మీ అన్నయ్య గారికి మూడో, నాలుగో ఎన్నివేలు అవసరమో అడిగి ఆసొమ్ము తీసియివ్వు" అన్నారు.

"ఇప్పుడు డబ్బెందుకు బావగారూ!" అన్నాడు రామజోగికాస్త మొమాటంగా.

"ఎందుకా? నాకు తెలిసినంత వరకూ ఇంగ్లీషు చదువులు ఉచిత విద్య కాదనుకుంటాను. స్కూల్లో ప్రవేశరుసుము, నెలజీతాలు పుస్తకాలు, బట్టలు, వగైరా స్కూలు వారు ఉచితంగా ఇవ్వరు కనుక" అన్నారు.

"అదికాదు బావగారూ! అవన్నీ నేను..." అని ఏమో చెప్పబోయేడు. ఆవరకే సోమయాజిగారు లేచి పెరట్లోకి వెళ్లి పోవడంతో మౌనం వహించేడు.

సోమయాజిగారి ఏకైక సంతానం శివశర్మ. వయస్సు తొమ్మిది సంవత్సరాలు. మంచి తెలివైనవాడు. ఎలిమెంటరీ స్కూల్లో ఐదవతరగతి పూర్తి చేసేడు. తండ్రి వద్ద వేద, సంస్కృతం నేర్చుకుంటున్నాడు.

రామజోగి కామేశ్వరమ్మ అన్న. మంచి లౌక్యుడు. అతడు ఏ పనిచేసినా ఎంతో ముందు చూపుతో పథకం వేసి చేస్తాడు. వేదం, సంస్కృతం నేర్చుకుని పట్టణంలో సంస్కృత కళాశాలలో తెలుగు పండిట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అయనకు కాదంబరి అనే ఆరేళ్లకూతురుంది. పెద్ద చదువు చదివి మంచి ఉద్యోగస్తుడికిచ్చి తన కూతుర్ని పెళ్లిచెయ్యాలని అతని సంకల్పం-అందుకు మేనల్లుడిని అన్ని విధాల తీర్చి దిద్దాలనుకుని పథకం వేసుకున్నాడు. చెల్లెల్ని పురికొల్పి మేనల్లుడిని ఉసికొల్పి

కాన్వెంటు చదువుకు ఒప్పించి వెంట పట్నం తీసుకొచ్చాడు. కాన్వెంటులో చేర్పించాడు. మేనల్లుడి చదువు ఖర్చుతోనే తన కొడుకు చదువు ఖర్చుకలిసి రావాలని ప్లాను వేసుకుని వాడిని ఎల్.కె.జీలో చేర్పించాడు.

సోమయాజిగారి ఏకైక పుత్రుడిని అల్లుడుగా చేసుకొని ఆయన ఆస్థినంతా దక్కించుకోవాలనేది రామజోగి మనసులోని కోరిక.

శివశర్మ స్వతహాగా ఎంతో తెలివైనవాడు. మంచి చురుకైనవాడు. చదువులో అన్ని క్లాసుల్లోనూ ఫస్ట్ వస్తున్నాడు. శలవుల్లో ఇంటికి పంపితే మేనల్లుడు మనసు మార్చుకొని ఎక్కడ చెయ్యి జారిపోతాడో అన్నభయంతో ఏదో నెపంతో వాడిని తల్లిదండ్రులవద్దకు పంపకుండా మేనేజ్ చేస్తున్నాడు. ఒకవేళ వెళ్లాల్సివస్తే రామజోగి కూడ వెళ్లి వస్తున్నాడు.

కన్నకొడుకు వేదవిద్య కాదని ఇంగ్లీషు చదువులకు వెళ్లడం అందుకు వాడిని కన్న తల్లే ప్రోత్సహించడం సోమయాజిగారు మనస్సులోనే ఎంతో బాధపడ్డారు. వంశపారంపర్యంగా వస్తున్న వేదవిద్య తనతోనే అంతరించిపోతుందేమోనని దిగులు చెందేరు.

శివశర్మ కాలేజీ చదువుకు వచ్చాక తన బసమేనమామ ఇంటి నుండీ హాస్టల్‌కి మార్చాడు. డిగ్రీ చదువులో స్టేట్‌ఫస్ట్ సాధించి యూనివర్సిటీలో పోస్ట్‌గ్రాడ్యుట్‌లో గోల్డ్ మెడల్ అందుకున్నాడు. ఐ.ఏ.ఎస్. పూర్తిచేసి ఢిల్లీలో ఉద్యోగం సంపాదించుకున్నాడు.

రామజోగి ఆనందానికి అంతులేదు. 'తన పథకం ప్రకారం మేనల్లుడు పెద్ద చదువు చదివి మంచి ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఇక ఆ పెళ్లికాస్త జరిపించేస్తే తన లక్ష్యం నెరవేరుతుంది' అనుకున్నాడు.

బావగారితోను, చెల్లెలితోను మేనల్లుడి ఎదుటే పెళ్లివిషయం ప్రస్తావించేడు. వాళ్లు సమాధానం చెప్పేలోపలే శివశర్మ తనకు మేనరికం చేసుకోవడం ఏమాత్రం ఇష్టంలేదని నిర్మొహమాటంగా చెప్పేడు. తనతో చదువుకున్న అమ్మాయి కాత్యాయనిని చేసుకుంటానన్నాడు. కాత్యాయని డా. సంజీవరావుగారి ఏకైక పుత్రిక ఎమ్.ఎ. వరకూ చదివింది. మంచి అందకత్తె . ప్రస్తుతం పి.హెచ్.డి. చేస్తోంది. డాక్టర్ సంజీవరావుగారికి పట్టణంలో పెద్ద నర్సింగ్ హోమ్ ఉంది.డాక్టరుగా మంచిపేరు పలుకుబడి గల వ్యక్తి.

మేనల్లుడి మాటలకు రామజోగి మండిపడ్డాడు. విశ్వాసం లేని వాడని నిందించేడు. బంధుత్వం లెక్క చెయ్యకుండా మౌనం వహించిన చెల్లెల్ని, బావగారిని ఎన్నో విధాలుగా తూలనాడేడు. తన పథకం పారనందుకు ఎంతో విచారించేడు.

మేనకోడలు తనకు కోడలు కాలేదని కామేశ్వరమ్మ కొంత చింతించినా మంచి అందం, చదువు ఉన్న పిల్లకోడలు కాబోతున్నందుకు ఎంతో సంతోషించింది. కొడుకు పెళ్లి విషయంలో కూడ సోమయాజిగారు పెదవి విప్పలేదు.

డా. సంజీవరావుగారు కూతురి పెళ్లి శివశర్మతో ఎంతో వైభవంగా జరిపించేరు. కామేశ్వరమ్మ ఆనందానికి అంతులేక పోయింది. పెళ్లికి రామజోగి కుటుంబం రాలేదు.

పెళ్ళితంతుపూర్తయిన తరువాత సోమయాజిగారు తిరుగుప్రయాణవిషయం వియ్యంకుడితో చెప్పాలని భార్యను వెంటపెట్టుకొని సంజీవరావుగారి వద్దకు వెళ్లారు. వారు వెళ్లేసరికి సంజీవరావుగారు, అతని భార్య ఒకావిడితో ముచ్చటిస్తున్నారు. అంతలో కాత్యాయని, శివశర్మ అక్కడకు వచ్చారు.

"రండి బావగారూ! ఈవిడ డాక్టర్ మేరీ! ఇదివరకు మా నర్సింగ్‌హోంలోనే పనిచేసేవారు. కాత్యాయని కన్నతల్లి యీవిడ. పుట్టగానే మాకు దత్తతపెంపకాని కిచ్చేరు." అని ఇంట్రడ్యూస్ చేసేరు.

వియ్యంకుడి మాటలకు షాక్ అయ్యారు సోమయాజిగారు, భార్య. శివశర్మ సంగతి సరేసరి. తన ముఖం తండ్రికి చూపలేక చివాలున బయటకు వెళ్లిపోయేడు.

సోమయాజిగారు వెంటనే తేరుకొని "మేము ఊరికి బయలుదేరుతున్నాం! ఆ విషయం మీకు చెప్పిపోదామని వచ్చాం!" అని భార్యను తీసుకొని ప్రయాణ మయ్యేరు.

"క్రొత్తకోడలిని గృహప్రవేశానికి తీసుకొని రాలేదేమని" గ్రామప్రజలంతా వారిని ప్రశ్నించారు.

"అబ్బాయికి సెలవు దొరకలేదని" తప్పించుకున్నారు.

సోమయాజిగారు క్రమంగా వేదం నేర్పడం మానుకున్నారు. తిరిగి ఇన్నేళ్ల తరువాత రామశర్మను చూడగానే వాడిని శిష్యుడిగా స్వీకరించి వేదం నేర్పాలన్న కోరిక కల్గింది.

రామశర్మ బట్టలు మార్చుకొని మండువాలో చిత్రాసనం మీద వ్యాసపీఠం ముందుకూర్చున్న సోమయాజులుగారి వద్దకు వెళ్లి వారిఎదుట తాటి ఆకుల చదరమీద కూర్చున్నాడు.

ఆయన వాడి వేపు అప్యాయంగా చూసి "ఏంబాబూ! ఈ రోజుల్లో ఉన్నవారు, లేనివారు అంతా ఇంగ్లీషు చదువులకు మొగ్గుచూపుతున్నారు. ఇంగ్లీషు చదివి మంచి ఉద్యోగస్తులవ్వాలని ప్రయత్నిస్తున్నారు. మరి నువ్వు వేదం నేర్చుకుందామని ఎందుకు అనుకున్నావు?" అన్నారు నవ్వుతూ.

కాస్సేపు మౌనం వహించి ఇంగ్లీషు చదువుకు అవకాశం లేదండీ" అన్నాడు.

"నేను చదివిస్తాను చదువుకుంటావా?"

"వొద్దండి! నాకు వేదం నేర్చుకోవాలని ఉంది" అన్నాడు

"లోగడ ఎవరి వద్దైనా ఏమైనా నేర్చుకున్నావా?"

"ఉపనయనం చేయించిన గురువుగారి వద్ద సంధ్యావందనం నేర్చుకున్నాను. శ్రీసూక్తం, పురుషసూక్తం, నమకం, చమకం, అరుణం మావీధిలో దేవాలయంలో రికార్డులు వేస్తే విని నేర్చుకున్నాను" అన్నాడు.

"రుద్రనమకం చెప్పమన్నారు.

రామశర్మ చెప్తూ వుంటే ఆయన కూడ స్వరంకలిపి కొంత వరకూ చెప్పి "ఇక చాలు" అన్నారు.

"ఉచ్చారణ, స్వరం బాగున్నాయి" అనుకున్నారు.

ముందుగా యజుర్వేదం ప్రారంభించేరు. ప్రతీది మూడు సంతలు చెప్పించుకొని వల్లేవేసి అప్పగిస్తున్నాడు. రామశర్మ 'ఏకసంతగ్రాహి' అని గుర్తించేరు. కుర్రాడి దీక్ష పట్టుదలకు మెచ్చుకున్నారు. శిష్యుడి కోరికమేరకు మూడు వేదాలు ప్రారంభించి మూడు పూటలా చెప్తున్నారు. నేర్చుకున్నది తడబడకుండా ఎప్పటికప్పుడు అప్పగిస్తున్నాడు. సమయం వృథా చేయకుండా గురువుగారికి సేవ చేస్తూ వారు చెప్పింది నేర్చుకుంటున్నాడు.

భర్త ముఖంలో మునుపటి కళ, తేజస్సు, సంతోషం తిరిగి చూడగలిగింది

కామేశ్వరమ్మ, అందుకు ఎంతో సంతోషించింది.

రామశర్మకు పదిహేను యేళ్ళు రాకుండానే నాలుగు వేదాలు క్షుణ్ణంగా నేర్చుకుని గురువుని మించిన శిష్యుడిలా తయారయ్యాడు. ఇప్పుడు సంస్కృతం, శాస్త్రాలు అభ్యసిస్తున్నాడు. మొదట్లో రామశర్మను "పండుగులకు మీ వాళ్ళ వద్దకు వెళ్తావా" అని అడిగేరు సోమయాజి గారు. "వెళ్లను నాకు చదువే ముఖ్యం" అని దృఢంగా చెప్పేడు. ఒకవేళ తాను అటు వెళ్లగానే ఇటు గురువుగారు మనసు మార్చుకొని చదువు చెప్పడానికి నిరాకరిస్తారేమో నన్న భయం! రామశర్మకుంది.

ప్రభుత్వం వారు ప్రతియేడూ తిరుపతిలో వేదపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికేట్స్ ఇస్తున్నారు. ప్రథమ శ్రేణి వారికి బంగారు పతకం, వెయ్యి రూపాయల నగదు, దుశ్శాలువాలతో సత్కరిస్తున్నారు. పరీక్షలు నాలుగు వేదాల్లోనూ జరుగుతాయి.

సోమయాజిగారు మొదట్లో పరీక్షాధికారిగా వెళ్లేవారు. తరువాత కొన్నేళ్లుగా ఏదో నెపంతో తప్పించుకుంటున్నారు. లోగడ ఆయన వద్ద చదువుకున్నవారంతా తిరుపతిలో పరీక్షకు వెళ్లి ఉత్తీర్ణులయ్యారు.

"తిరుపతిలో జరగబోయే వేదపరీక్షకు వెళ్తావా?" అని రామశర్మను అడిగేరు గురువుగారు.

గురువుగారి ప్రశ్నకు రామశర్మ తలవంచుకుని కూర్చున్నాడు. సమాధానం చెప్పలేదు.

"ఏం బాబూ! వెళ్లవా?" అన్నారు.

"నా దగ్గర డబ్బులు లేవండీ!" అన్నాడు విచారంగా.

గురువుగారి గుండె కలుక్కుమంది.

"పరవాలేదు నేను నిన్ను తీసుకొని వెళ్తాను" అన్నారు.

రామశర్మ ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. పరుగు పరుగున వెళ్లి విషయం గురువమ్మగారికి చెప్పేడు.

కామేశ్వరమ్మకు నమ్మకంలేక భర్తను అడిగింది.

"అవును కామేశ్వరీ! పరీక్షాధికారిగా రమ్మని నాకు ఆహ్వానం వచ్చింది. పరీక్షలకు రామశర్మను తీసుకొని వెళ్తానన్నాను! అన్నట్లు లోగడ నువ్వు తిరుమలేశుని దర్శించి రావాలని ఉందన్నావు కదా! నువ్వూ బయల్దేరు" అన్నారు.

గురుపత్ని కూడ తమతో వస్తున్నందుకు రామశర్మ ఆనందంతో చిందులేసేడు. ముగ్గురూ తరుపతి చేరుకున్నారు. చాల సంవత్సరాల తరువాత తమ ఆహ్వానాన్ని మన్నించి వచ్చిన సోమయాజిగారికి ఘనస్వాగతం లభించింది. ముగ్గురూ ముందుగా వెళ్లిదైవదర్శనంచేసుకొని వచ్చారు.

"తన శిష్యుడు నాలుగు వేదాల్లో పరీక్షలకు హాజరవుతున్న కారణంగా తాను ' పరీక్షాధికారిగా ఉండడం భావ్యం కాద"న్నారు.

అంతేకాదు రామశర్మ తన శిష్యుడని ఎవరికీ పరిచయం చెయ్యలేదు.

"పరీక్షాధికారిగా కాకున్నా అధ్యక్షస్థానంలో కూర్చొని సూపర్వైజ్ చెయ్యమని కోరేరు. సోమయాజిగారు కాదనలేకపోయేరు.

పరీక్షకు హాజరైన విద్యార్థులందరిలోనూ అతి తక్కువ వయస్సు వాడు రామశర్మ. వారి వయస్సులో సగం వయస్సుకూడ లేదు.

"వీడు వారిలో నెగ్గుకు రాకలడా? పసివాడు వారి ముందు భయపడకుండా నిల్చోగలడా? అని భయపడింది కామేశ్వరమ్మ

రామశర్మ మాత్రం ఎంతో ధైర్యంగా ఉన్నాడు.

పరీక్షాధికారులు మొదట రామశర్మను చూసి అతడు ఎవరో ఏమిటో తెలియక తమలో తాము ముసిముసినవ్వులు నవ్వుకున్నారు.

వారు అడిగింది తడవుగా ఏమాత్రం జంకూ భయం లేకుండా గడగడా చెప్పడంతో నిర్ఘాంతపోయారు.

నాలుగు వేదాల్లోనూ ఒకేమారు పరీక్షకు హాజరైన ఏకైక విద్యార్థి రామశర్మ. నాలుగు వేదాల్లోనూ ఆయేడు ప్రథముడిగా ఎంపికచేయబడి స్వర్ణపతకాలు అందుకున్నాడు. రామశర్మ గురువు సోమయాజిగారని తెలుసుకొని అందరూ ప్రశంసించేరు.

రామశర్మ స్వర్ణపతకాలు, సర్టిఫికేట్స్, శాలువలు తీసుకొని సభలో ముందు

వరుసలో కూర్చున్న గురువుగారి వద్దకు ఆనందంతో వచ్చి గరువుగారికి, ఆయన ప్రక్కనే కూర్చున్న గురుపత్నికి పాదాభివందనం చేసేడు.

"బాబూ! ఈ సంతోషంలో పాలు పంచుకోవల్సింది నీకు జన్మనిచ్చిన నీ తల్లిదండ్రులు! వెళ్లివాళ్ల దీవెనలు పొందిరా!" అంది కామేశ్వరమ్మ రామశర్మతో.

రామశర్మ గురువుగారి వేపు చూశాడు.

సోమయాజులు గారు భార్య వేపు ప్రశ్నార్థకంగా చూసి

"ఏమిటీ రామశర్మ తల్లిదండ్రులు ఈ సభకు వచ్చారా?

"అవునండీ! వెళ్లు బాబూ! వెళ్లి వాళ్లను తీసుకొనిరా"

రామశర్మ నెమ్మదిగా వెళ్లేడు.

"అంటే వాళ్లు ముందుగానే నీకు తెలుసా!"

"తెలియదండీ!

"మరి?"

"ఊహించాను... మీ శిష్యుడి రూపు తల్లి పోలికైనా అలవాట్లు, మాట, నడక తీరు పూర్తిగా తండ్రిపోలికే!"

"అంటే రామశర్మ...!"

"అవునండీ! నేను గ్రహించిన యీ విషయం ముందుగా మీకు చెప్తే వాడికి చదువు చెప్పకుండా పంపించి వేస్తారేమోనన్న భయంతో ఈ విషయం మీకు చెప్పకుండా యిన్నాళ్లూ రహస్యంగా ఉంచేను. నన్ను క్షమించండి" అంది.

"లేదు కామేశ్వరీ! నేనే తప్పు చేసేను. అబ్బాయి ఎవరో తెలిసికూడ నీకు నేనే చెప్పలేదు. నా లక్ష్యసాధనకోసం వాడికి శిష్యుడిగానే శిక్షణ ఇవ్వాలనుకున్నాను..."

"కాదు గురువుగారూ! అమ్మగారూ మీరూ నన్ను క్షమించాలి! మీరెవరో నాకు ముందుగానే తెలిసినా నేనెవరో చెప్పకుండా మీవద్దవిద్య నేర్చుకున్నాను" అన్నాడు రామశర్మ.

"ఇంకా గురువుగారూ! అమ్మగారూ ఏవిట్రా? తాతగారు నాయనమ్మా అని

పిలవక" అన్నారు సోమయాజిగారు పాదాభివందనం చేస్తున్న కొడుకు కోడలిని దీవించేరు.

"నాన్నగారూ! కొడుకుగా నేను మీ ఆశయాలు నేరవేర్చలేకపోయాను" అన్నాడు శివశర్మ

మనవడిగా నీ కొడుకు అది సాధించేడు" అన్నారు సంతోషంతో సోమయాజి గారు.

"అందుకు 'నాలుగు స్తంభాలాట' తప్పనిసరి అయింది" అంది కాత్యాయని చిరునవ్వుతో.

(ఫేకర్ 1966 సంక్రాంతి సంచిక) ✪